క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయ స్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

నేడు పంచేడులో 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పంచేడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 7 నుంచి జరిగే కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, ప్రజలకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుంటారని తెలియజేశారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత మూలవిరాట్‌కు చందనాలంకరణ గావించారు. ఆకులూరు మధు–నీరజా దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

ప్లేట్ల వితరణ



మనుబోలు : మండలంలోని బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన శానంపూడి సుబ్బారెడ్డి మంగళవారం భోజన ప్లేట్లు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చందన, ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు, మధు, సుమతి, రాజ్యలక్ష్మి, సహనాబేగం, బ్యూలా, దీప్తి, శేఖర్, భద్రయ్య ఉన్నారు.

మహ్మదాపురం పాఠశాలకు ప్రథమ స్థానం



హెచ్‌ఎం, పీడీలకు సన్మానం

పొదలకూరు : క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్ మంగళవారం జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ పాఠశాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో క్రీడల్లో పాల్గొని రాణించినందుకు హెచ్‌ఎం సీహెచ్ రామకృష్ణయ్య, పీడీ విజయ్‌విశ్వేశ్వరన్‌లను డీఈఓ సన్మానించారు.

కోలాహలంగా ఓనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఓనం పండగను కేరళ సంప్రదాయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి నవకలశ నవాభిషేకం, విశేష పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భగవతిసేవను నిర్వహించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, శంకరన్, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు రామమూర్తి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బుచ్చిరెడ్డిపాళెం బాలికోన్నత పాఠశాలలో ప్రముఖుల చిత్రాలతో విద్యార్థినులు

వెంకటాచలం: మండలంలోని పలుచోట్ల తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తెలుగు భాషోద్యమ పితామహులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని వివరించారు. తహసీల్దార్ టి.కృష్ణ పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన సేవల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు పేర్కొన్నారు. డాక్టర్ సి.రాజారామ్, టి.విమల, కె.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• మండలంలోని గొలగమూడి వద్దనున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు క్రీడా పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొండల్‌రావు పాల్గొన్నారు.



కొడవలూరు : వెంకన్నపురంలో..



మనుబోలు : మడమనూరు పాఠశాలలో..



తోటపల్లిగూడూరు : సౌతిఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో..



కొడవలూరు : గిడుగు, ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బుచ్చిరెడ్డిపాళెం : గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

తెలుగు భాషను మరువొద్దు

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ఇతర భాషలను నేర్చుకోవడంతో పాటు తెలుగుభాషను మరువొద్దని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, వేదవతి, నిర్మల, వేణు, మున్వర్, బ్రహ్మారెడ్డి, విజయకుమారి పాల్గొన్నారు.

• బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో ప్రముఖుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. హెచ్‌ఎమ్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• పెనుబల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

పొదలకూరు : తెలుగు భాష ఔన్నత్యం కోసం కృషి చేసిన గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ సాయిగణేష్‌బాబు గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

• మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో గిడుగు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంఘసంస్కర్తల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో..

ఇందుకూరుపేట : మండలంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, నర్సింగరావు, విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

• కొమరిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.దశరధరామిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, సాంస్కృతిక, పద్యపఠనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.అరోరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తుకూరు మండలంలో..

ముత్తుకూరు : తెలుగు భాషా దినోత్సవం–వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు జెడ్పీ హైస్కూళ్లు, యూపీ స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగు భాషా ప్రముఖుల వేషధారణలతో ఆలరించారు. బ్రహ్మదేవి హైస్కూల్ హెచ్‌ఎం తాన్య ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో తెలుగు పండితుడు సోమా పద్మారత్నంను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం

మనుబోలు : మన మాతృభాష తెలుగును పరిరక్షించుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ శివకృష్ణయ్య అన్నారు. తెలుగ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామమూర్తి జయంతిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదని, అయితే మాతృభాషను మరువ వద్దని పిలుపునిచ్చారు.

• మండలంలోని బద్దెవోలు, మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో డీటీ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో నాగార్జున రెడ్డి, హెచ్‌ఎంలు రాధాకృష్ణ, చందన పాల్గొన్నారు.

కొడవలూరు మండలంలో..

కొడవలూరు : మండల పరిధిలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి తెలుగు వంటకాలతో సామూహిక విందు భోజనం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డి.ఓబులేసు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలను సునాయసంగా నేర్చుకోవచ్చన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండడంతో పాటు మంచి భవిష్యత్తును పొందవచ్చని సూచించారు. అనంతరం గిడుగు రామమూరి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధిక, జయప్రకాష్, రమణయ్య, బాబునాయుడు, పీడీ శ్రీవిద్య పాల్గొన్నారు.

గిడుగు సేవలు ప్రశంసనీయం

తెలుగు భాషా అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు ప్రశంసనీయమని హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు కొనియాడారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. అనంతరం గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని బి.శ్రీశైల తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గిడుగు రామమూర్తి

తోటపల్లిగూడూరు : తెలుగు భాషా దినోత్సవ వేడుకలు మండల పరిధిలో ఘనంగా జరిగింది. ఈ క్రమంలో సౌతిఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు పద్యాలు, గేయాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం షేక్.అహ్మద్‌బాషా మాట్లాడుతూ వ్యవహారిక భాషకు, గ్రాంధిక భాషకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించడమే కాకుండా వ్యవహారిక భాషను తెలుగు ప్రజలకు చేరువకావడంలో గిడుగు రామమూర్తి పాత్ర కీలకమన్నారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా ఆయన జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు పుస్తక ప్రదర్శనశాల ద్వారా ప్రాచీన కవులు, ఆధునిక కవుల చిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అలాగే తెలుగు సామెతలు, జాతీయాలు, చక్కని కథలతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయినులు వసంతలక్ష్మి, హిప్సి విద్యుల్లత పాల్గొన్నారు.



ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్లో ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు



ముత్తుకూరు : బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్లో బహుమతుల ప్రదానం



మనుబోలు : తహసీల్దార్ కార్యాలయంలో..



వెంకటాచలం: తహసీల్దార్ కార్యాలయంలో గిడుగు రామమూర్తికి నివాళులర్పిస్తున్న జేసీ కూర్మనాథ్



వెంకటాచలం: గొలగమూడిలోని బీసీ బాలికల పాఠశాలలో..



పొదలకూరు : తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



పొదలకూరు : సంఘ సంస్కర్తల వేషధారణలో విద్యార్థులు



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్



బుచ్చిరెడ్డిపాళెం : ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు



ఇందుకూరుపేట : కొత్తూరు జెడ్పీహెచ్ఎస్‌లో..

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారమైందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్ల సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ముఖ్యంగా ప్రతినెల 1వ తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వడంతో పాటు వారికి రావాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి అందే విధంగా దోహద పడుతున్నారని తెలిపారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని వివరించారు.

సర్వమత ప్రార్థనలు

రామచంద్రాపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి స్థానికంగా ఉన్న చర్చిలో ప్రార్థనలు జరిపారు. హిందూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాడు–నేడు ద్వారా అభివృద్ధి చెందిన స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, జయంతి, షకీలాబేగం, నాగరాజు, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, శివకుమార్‌రెడ్డి, సత్యనారాయణ, అనంతమ్మ, లక్ష్మీకాంతమ్మ, పార్టీ నేతలు భరత్, కోటయ్య, రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, హనుమారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

నారికేళపల్లిలో పశువైద్య శిబిరం

• ఉచితంగా మందుల పంపిణీ

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లిలో అదానీ–బైఫ్ సంస్థల సహకారంతో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ నెల్లూరు ఉపసంచాలకుడు డాక్టర్ నాగమణి, సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్, ముత్తుకూరు సహాయ సంచాలకుడు డాక్టర్ నిర్మల తదితరులు ఈ శిబిరంలో పశువులకు వైద్య చికిత్సలు చేశారు. శస్త్ర చికిత్స నిపుణులు సరిత, రాజ్యలక్ష్మి, గోవర్ధన్ తదితరలు వైద్య సేవలు అందించారు. మొత్తం 58 దూడలు, 26 పశువులు, 158 గొర్రెలకు చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 కేజీల లవణ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. సాహుల్, పోతురాజు, మురళి, శ్యామ్ పాల్గొన్నారు.



దూడలకు మందు తాగిస్తున్న సిబ్బంది

ఆరోగ్యశ్రీ వైద్యశిబిరానికి విశేష స్పందన

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పాలినాయుడు చెరువు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, జిల్లా గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా ఇక్కడ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరుకు చెందిన అరవింద కిడ్నీ సెంటర్, రెయిన్‌బో ఆస్పత్రికి చెందిన వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులను పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్, పి.సునీల్‌కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



ఉచితంగా మందులను అందజేస్తున్న వైద్యులు

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సెబ్ సీఐ వెంకటరావు

• సెబ్ సీఐ వెంకటరావు

పొదలకూరు : మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు సంభవిస్తాయని, విద్యార్థులు, యువత వాటికి దూరంగా ఉండాలని పొదలకూరు సెబ్ సీఐ వెంకటరావు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై స్థానిక ప్రభుత్వ డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత పాడవుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సనత్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి హానికరం

మనుబోలు : మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి హానికరమని సెబ్ సూపరింటెండెంట్ ఎస్ రవికుమార్ అన్నారు. మాదక ద్రవ్యాలతో వచ్చే నష్టాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెబ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదువుపై మాత్రమే శ్రద్ధ పెట్టాలన్నారు. కొత్త వ్యక్తుల పరిచయాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి తాగినా, అమ్మినా, రవాణాకు సహకరించినా నేరమన్నారు. దీనిపై విద్యార్థుల దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, సబ్ ఎస్సై రవీంద్రబాబు, అధ్యాపకులు దిలీప్‌కుమార్, శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, హనుమంతురావు, రమేష్, బాయమ్మ, సబ్ సిబ్బంది మల్లికార్జున, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ అధికారులు

నార్తురాజుపాళెంలో పొలంబడి

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి వరిలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. శత్రు పురుగులను నివారించుకోవడంతో పాటు మిత్ర పురుగులను సంరక్షించుకోవాలని చెప్పారు. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించి ఉన్నందున నివారించుకోవాలని సూచించారు. వీఏఏ శివజ్ఞాన, పాల్గొన్నారు.

రంగడి దేవస్థానంలో పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా విశేష పూజలను మంగళవారం జరిపారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం గోపురోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సుధీర్‌కు ప్రశంసాపత్రం

బుచ్చిరెడ్డిపాళెం : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రశంసాపత్రాన్ని అందజేసింది. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలుగు అకాడమి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి గండికోట సుధీర్‌కు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా అకాడమి చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ భరత్ చేతుల మీదగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

